# "నువ్వు కాబట్టి—"

గాలి వీచింది, ధూళి లేచింది. ఇక చూడండి ఆ వీచిన గాలి, లేచినధూళి సలిపే సరసాలు! మనుష్యు లున్నారని కాస్త ఆ మొహాలకు సిగ్గేనాలేదు. నడివీధిలో ఇచ్ఛవచ్చినట్లు ప్రణయోన్మాదంతో పరుగులు పోతున్నాయి. ఇదంతా భరించలేని మనసు ఇంటికి దారితీసింది. దారి తీయడమైతే జరిగింది కాని—అడుగు పడటం లేదు. అప్పుడే ఇంటికి వెళ్ళడమేమిటి? ఇంకా దీపాలైనా పెట్టేవేళ కానేలేదు. అయినా ఈ వేళప్పుడు ఇంటికి అఘోరించిందెప్పుడు? ఇలా ఈ సమయంలో ఇంటికి వెళ్ళడం... అదో క్రొత్తగా ఉంది. మా వీధిలోని సుందరీమణులంతా చూసి నవ్వుతారేమో - వాళ్ళ సోదరీమణికోసం ఇంత జరూరుగా హాజరైనందుకు! కాని ఈ దుమ్మురాక్షసి ఈ గాలి రాక్షసుడూ ఇలా పేట్రేగి పోతూంటే—ఇక వెళ్ళక తప్పుతుందా ఏమిటి! అదేమిటో గాని కంట్రోల్సు ఎత్తెయ్యగానే కొండంత ఎత్తున లేచి, షావుకారు ప్రియుణ్ణి బిగ్గరగా కౌగిలించుకుంటూన్న ఎంతో ప్రియమైన బియ్యం ధరల్లాగ,

ఒకటే లేచిపోతూంది దుమ్ము! ఆ ధరా, ఈ దుమ్మూ సరిగ్గా ఒక్కటే! మన ప్రాణాలు తియ్యడానికి!

ఇష్టంలేకుండా శరీరాన్ని అలాంటి వేళప్పుడు ఇంటికి చేరవేయడమనేది నేనెప్పుడూ చేయలేదు. కానయితేనేం ఆ నాడు జరిగింది. ఆనాడు ఇంకొకటికూడా జరిగింది. అది మా ఆవిడ ఏనాడూ లేనిది అన్ని పనులూ చక్కబెట్టుకొని కేవలం నా రాకకోసమే అన్నట్టుగా ఎదురుచూస్తూ కూర్చోవడం! ఏదో విశేష ముందనుకున్నాను. ఉందనే సూచన ఆమె మొహంలో స్పష్టంగా వ్రాయబడే ఉంది. పైపెచ్చు ఓ చిరు నవ్వు సగం సగంగా ప్రదర్శించి మిగతాసగాన్ని మింగేసింది. "ఏమిటీ"అన్నట్టుగా నేనునవ్వాను. ఇప్పుడప్పుడేచెప్పడానికి వీల్లే దన్నట్టుగా ఆమె కళ్ళు పోజుపెట్టాయి. సరేలే, చెప్పకుండా ఎక్కడికి పోతుందనుకుంటూ స్నానానికి నీళ్ళు పడేయమన్నాను. ఆమె నిముషాలమీద పని ముగించింది. నేనుకూడా త్వర లోనే తెమిల్చిపారేశాను. అప్పటికందుకుంది మా ఆవిడ. "ఎప్పుడూ లేదు; ఇంత త్వరగా దయచేశారేం" అంటూ. అందుకు నేనేమీ జవాబు చెప్పలేదు. అయినా దాని కామె జవాబు పొందవలసిన అవసరమే లేదన్నట్టుగా ఊరుకుని— మళ్ళీ తనే- "మీకో మంచివిషయం చెబుతాను; మీ రేదేనా బహుమతీ ఇస్తానంటే" అంది-ఉండబట్టలేక కాబోలు ఊరింపుగా. వెంటనే నేను "మంచి విషయాలకు లంచాలేమిటి నీ మొహం" అన్నా. ఆమె వెనువెంటనే "అదేమిటండోయ్. బహు

మతులు, లంచాలుకావుగా" అంది పెద్ద తెలివితేటలుపయో గించేసినట్టు. "సరేలే అదేమిటో ఊరించక చెప్దూ" అన్నా. "మరి బహుమతీ మాట"అంది. "అసలు నువ్వు చెప్పేది మంచి విషయమౌనో కాదో నేను తేల్చుకోకుండా బహుమతీ ఎట్లా నిర్ణయించడం ?" అన్నాను తెగతెంపుగా. ఆమె నిరుత్సాహ పడిపోలేదు. అలా అయిపోకుండా, "పోనీ అదేమిటో మీరు గ్రహించుకోండి చూదాం" అంది. వెంటనే నాకంతా అవగాహన అయిపోయింది. ఇట్లా మాట్లాడేవాళ్ళు దేని గురించి చెప్తారో నాకు సులువుగానే అర్థమైపోయింది. ఇన్ని సినిమాలు చూస్తున్నాం, ఇన్ని కథలు చదువుతున్నాం—కనీసం ఆ మాత్రమైనా చెప్పలేమా ? అంచాత వెంటనే, "కొంపతీసి కడుపుతో ఉన్నావేమిటీ" అన్నా, ఉన్న గంపెడు పిల్లల్నీ పెంచలేక చస్తూన్నట్టు ! ఆమె వెంటనే "ఛా-పోదురూ"అంది, ఇవేమి మాటలూ అన్నట్టు. నేను వెంటనే క్రుంగిపోయాను. ఎంత తప్పుడు అంచనా వేశాను ! తప్పుగా చెప్పాను కాబట్టి, ఆ విధంగా ఓడిపోయాను కాబట్టి నాలో కోపం ముంచుకొచ్చి "అయితే నాకు తెలియదు ఫో" అన్నా. ఐతే ఆమె ఓపట్టాన వదలొద్దూ ? "పోనీ కనీసం మనఇంట్లో లేనిదేమిటో చెప్పండి" అంది, పిల్లలద్వారానే సమాధానం వినడానికి ప్రయత్నించే మంచి ఉపాధ్యాయుడులా. ఈ ప్రశ్న వినగానే నాకు చిరాకెత్తింది. "ఆ మనింట్లో చాలా ఉన్నాయి లేనివి చెప్తాను వ్రాసుకో"అన్నా. అందుకామె "అబ్బే అవేమీ కాదండీ. మనం రోజూ అనుకుంటూ ఉంటాం కదండీ. ఫలానిది ఉంటే

బాగుండునని, అదేమిటో సెలవియ్యండి" అంది. వెంటనే నేను "ఏమిటే వెండి నేతిగిన్నా ? చంపావు. కొంపతీసి నువ్వు కొనేశావేమిటి? అందుకనే కాబోలు జేబులో డబ్బులు లెక్క చూసుకుంటే తక్కువయ్యాయి" అన్నా దొరకని దొంగను సునాయాసంగా పట్టేసినట్టు. వెంటనే ఆమె చాలా నిరుత్సాహ పడిపోయి, "అదేమిటి! మీ జేబులో డబ్బులు తియ్యడమేమిటి? ఇక ఈనిందలొక్కటే తక్కువ నా మొఖానికి" అంది. నాకూ వెను వెంటనే చాల బాధ కలిగింది. పాపం ! ఎప్పుడూ నా జేబులోని కానీ ముట్టుకున్న పాపాన పోలేదు. ఇలాంటి నింద ఆమెపై మోపడం తప్పే. కాని, "ఈ వెండిగిన్నె ఎక్కడిది" అని అడిగేశాను ఉండబట్టలేక. పాపం ఎంత ఉత్సాహంగా చెప్పా లనుకున్నదో అంతా క్రుంగిపోయి "మన స్నానాల దొడ్డి గోడ మీదకు మరి ఎలా వచ్చిందో, ఎవరింట్లోంచి ఏ కాకి ఎత్తుక వచ్చి అక్కడ విడచి పెట్టిందో" అంది. నిజంగా నేను చాలా నొచ్చుకున్నాను. నాకు మతిమరుపు తనం ఎక్కువ. డబ్బు ఎక్కడ బడితే అక్కడ విడచి పెట్టేస్తాను. మళ్ళీ ఎప్పుడో అప్పుడు ఆ డబ్బు ఎక్కడో అక్కడ ప్రత్యక్ష మవడం జరుగు తూనే ఉంటుంది.

మరునాడుదయం, ఆఫీసుకు వెళ్ళే సమయం ఆసన్న మయ్యేవరకూ లైబ్రరీలో పత్రికలు తిరగేసి, ఇంటికి బయలు దేరా. ఇంటి గుమ్మం ఎక్కే టప్పటికి మా ఆవిడతో అప్పటి వరకూ దొడ్డి గుమ్మం దగ్గర ఉండి మాట్లాడే, మా ఇంటికి

నాలుగిళ్ళ అవతల కాపురం చేస్తున్న అమ్మాయి - తుర్రున పారిపోయింది. నేను రివ్వున ఇంట్లోకి వచ్చాను. అసలు మగవాళ్ళకు ఆడవాళ్ళు ఏమి మాట్లాడుకుంటారో తెలుసుకోవాలన్న కుతూహలం బహు జాస్తీ! అంచాతనే, నేను చురుగ్గా మా ఆవిడ దగ్గరకు పోయి, "ఏమిటే సంగతి" అన్నానవ్వుతూ. ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. ఎంచేతనో మనిషి అదోలా వుంది. నేను "ఏం అలాగున్నావ్" అని మాత్రం అనకుండా, "అంతా క్షేమమేనా ?" అన్నా. దానికి కూడా ఆమె జవాబు చెప్పలేదు. కాని ఏదో ఓ పని చేసుకోవటానికి ప్రయత్నిస్తోంది. అయినా ఏం చెయ్యాలో ఆమె కేమీ తోచడం లేదనుకుంటా; ఏ పనీ చేయలేక పోతూంది. కాని కాస్సేపాగి తనే, "రాత్రి మీ రన్నట్టుగా నేను దొంగనే" అంది. నా గుండెల్లో పిడుగుపడ్డట్టయింది. పాపం! రాత్రంతా నేనన్న మాటమీదే మధనపడుతూ నిద్రపోయిందేమో ! ప్రొద్దుట నా నోట్సు పుస్తకంలోంచి జారిపడ్డ డబ్బు సంగతి చెప్తే అంతా సరిపోతుందనుకుంటూ, ఆ మాట చెప్పా. కాని ఆమె మళ్ళీ "కాదు. నేను నిజంగా దొంగనే" అంది. "నీకేమైనా మతిపోయిందా. నాతప్పు నేను ఒప్పుకుంటున్నాగా. ఇంకెప్పుడైనా అట్లాంటి పొరపాటు మాటలంటే—" అని ఏదో నే ననబోతూ ఉండగా, "వాళ్ళింట్లో వెండిగిన్నె కనబడడంలేదని ఇప్పుడే పార్వతి చెప్పింది." అని అంది. ఈ ముక్క అన్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్ళ చుక్కలు నిలుచున్నాయి. "మరి ఆ గిన్నె వాళ్ళదేమో చూపించ లేకపోయావా ?" అన్నా. కాని ఆమె,

"ఏమో, నా నోటివెంట మాటరాలేదు. ఏమీ మాట్లాడలేక పోయాను. అప్పుడే మీరు వచ్చారు. ఆ అమ్మాయి వెళ్ళి పోయింది" అంది. నేను "ఓహో" అనుకున్నా. ఇదంతా ధూళి మహిమ! అది ఎవరి హృదయాల్లో, ఏ రూపంలో ఉంటుందో చెప్పలేం. ఎప్పుడు ఎట్లా బయటపడుతుందో అంత కన్నా చెప్పలేం! "పోనీ ఇప్పుడైనా తీసుకెళ్ళి ఇచ్చేసెయ్" అన్నా. అందు కామె, "ఇప్పుడెలా? నన్నే మనుకుంటుంది?" అంది. నిజంగా మానవులు ఓ తప్పుచేసి మళ్ళీదాన్ని కాపాడు కోవడానికి ఇంకో తప్పు ఎట్లా చేస్తారో!

"మరి ఏంచేద్దామని నీ ఉద్దేశ్యం" అన్నా. "ఆ దెయ్యపు గిన్నెను విసిరేస్తాను" అంది పిచ్చిగా. అప్పుడు నేనో ఉపాయం చెప్పాను. అన్నివిధాలా చక్కనైన ఉపాయం! అది మరేమీ లేదు. "మా ఆయనగారు స్నానాలగది దగ్గరకు ఇప్పుడిలా వెళ్ళారు. మరి ఏ కాకి పెట్టిందో ఆ గోడమీద ఈ వెండిగిన్నె కనిపించింది. అది ఆయన తీసుకొచ్చి నాకు చూపిస్తే—నువ్వు చెప్పావుగా పార్వతీ, మీ గిన్నె పోయిందని—ఇలా తీసు కొచ్చేశాను. ఇది మీదేనేమో చూడు" అని తమాషాగా వాగేసిరమ్మన్నా. మా ఆవిడ మొదట తటపటాయించింది. చివరికి ఒప్పుకుంది.

వాళ్ళింటికి వెళ్ళిన మా ఆవిడ ఎప్పుడువస్తుందా అని ఆమె రాకకోసం ఎంతో ఎదురుచూశాను. ఆమె రాగానే, "ఏం, ఏమన్నారు" అన్నాను. మా ఆవిడ, "వాళ్ళదేనట"

అంది. "సరిగ్గా నేను చెప్పినట్లే చెప్పావా?" అన్నాను నా తెలివికి నేనే ముగ్ధుణ్ణయిపోయి. మా ఆవిడ, "ఆ-"అంటూ కాస్సేపాగి, "నువ్వుకాబట్టి ఇచ్చావు. ఈ వీధిలో ఇంకెవరికి దొరికినా ఇచ్చేవారుకాదు" అని వాళ్ళన్నట్టుగా చెప్పింది. వెంటనే నేను, "ఔను నువ్వు కాబట్టి–"అని పకపకా నవ్వాను. పాపం మా ఆవిడ నా నవ్వును మాత్రం అందుకోలేకపోయింది.